క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం



గన్నవరం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, ఎంపీడీఓ టి. స్వర్ణలత, ఎంఈఓ కె. రవికుమార్ పాల్గొన్నారు.

వేడుకగా త్యాగరాజస్వామి శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం త్యాగరాజ స్వామి పుణ్యతిథి సందర్భంగా సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాల శోభాయాత్ర, నగర సంకీర్తన నిర్వహించారు. సంగీత కళాశాలలో మేళతాళాలతో ప్రారంభమైన యాత్ర బీఆర్‌టీఎస్ రోడ్డు, శివాలయం వీధి, గిరివీధి, మారుతీ వ్యాయామశాల మీదుగా తిరిగి సంగీత కళాశాలకు చేరుకుంది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, శశిధర్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, కల్యాణరామన్, బీవీ విద్యాసాగర్, మల్లాది కార్తీక, త్రివేణి, లక్ష్మీనరసమ్మతోపాటు పలువురు విద్వాంసులు యాత్రలో పాల్గొని త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. సంగీత కార్యక్రమంలో భాగంగా బీవీఎస్ఎస్ త్రివేణి, సర్వజ్ఞ సువిధ, పెద్దిబొట్ల శైలజతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ కృతులను ఆలపించారు.

నేడు పంచరత్న కృతుల గోష్ఠిగానం

కాగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం నిర్వహించనున్నట్లు సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు వందల మంది విద్వాంసులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

200 మందికి అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం 200 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. తొలుత ప్రాంగణంలో వేంచేసి ఉన్న భూదేవీ, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణకు సహాయం అందించేవారు దేవాలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. శ్రీవారి పూజలకు వినియోగించిన పూలతో తయారైన అగర్‌బత్తి, సోప్‌లను కార్యాలయ ఉద్యోగులు విక్రయించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సూరపనేని శ్రీ చౌదరి, బిల్లా అమృత్ సూర్యకేదారేష్, శ్రీనివాసరావు, గంగాభవానీ పాల్గొన్నారు.

తుర్లపాటి పాత్రికేయ జీవితం సదాస్మరణీయం

విజయవాడ కల్చరల్: సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయ జీవితం సదాస్మరణీయమని పారిశ్రామికవేత్త అంబటి మధుమోహనకృష్ణ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కృష్ణ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శనివారం తుర్లపాటి కుటుంబరావు వర్ధంతి, సినీ సంగీత విభావరి, సామాజిక కార్యకర్త జేఎస్‌టీ సాయికి తుర్లపాటి స్మారక పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ తుర్లపాటి పాత్రికేయ జీవితాన్ని యువ జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తుర్లపాటి పాత్రికేయ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తుర్లపాటి కుటుంబరావు కుమారుడు జవహర్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విద్యావేత్త శేషుబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు పాల్గొన్నారు. సామాజిక కార్యకర్త జేఎస్‌టీ సాయికి తుర్లపాటి కుటుంబరావు స్మారక పురస్కారం ప్రదానం చేశారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

మినుము పంటకు తెగుళ్ల బెడద



బూడిద తెగులు సోకిన మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు



మినుము పంటకు సోకిన మారుకమచ్చ పురుగు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రబీ సీజన్‌లో రైతన్నలు చేపట్టిన మినుము సాగుకు తెగుళ్ల బెడద పట్టుకుంది. తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన దిగుబడి సాధించవచ్చనే నమ్మకంతో రైతాంగం అధికంగా మినుము, పెసర పంటల సాగు చేపట్టారు. గంపెడు ఆశతో మినుము సాగు చేసిన రైతులకు ఆది నుంచే చీడపీడలు ఉక్కిరిబిక్కిరి ఆడకుండా చేస్తున్నాయి. గన్నవరం నియోజకవర్గంలో సుమారుగా 10 వేల హెక్టార్లలో మినుము పంట సాగులో ఉంది. ఖరీఫ్ సీజన్‌లో బుడమేర వరద ముంపు, అకాల వర్షాలు రైతన్నను తీరని నష్టాన్ని మిగిల్చగా, రబీ సీజన్ కూడా నిరాశను మిగిల్చుతోంది.

బూడిద తెగులుతో తంట

గన్నవరం నియోజకవర్గంలో సాధారణంగా రైతులు సార్వాగా వరి, దాళ్వాలో అపరాల సాగు చేపట్టం పరిపాటి. సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో రైతులు రబీ సీజన్‌లో అపరాల సాగును ఎంపిక చేసుకుంటారు. ప్రస్తుత వాతావరణంలో ఉష్ణోగ్రత బాగా తక్కువగా ఉండటం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండటంతో మినుము పంటకు బూడిద తెలుగు వ్యాప్తి చెందుతోంది. దీనికి తోటు తెల్లదోమ సోకటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

పొలం గట్లపై అధికంగా కలుపు మొక్కలు పెరగటంతోనే తెల్లదోమలు వ్యాప్తి చెందుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పలుచోట్ల మినుములో పల్లాకు తెగులు, ముడత తెగులు, మారుక మచ్చ పురుగు ఆశించి రైతులను మరింత బేజారు చేస్తున్నాయి. గతంలో వాతావరణ పరిస్థితులు, చీడపీడల ఉధృతి కారణంగా వైరస్ వ్యాప్తి చెందటంతో మినుము పైరుకు పెట్టుబడి రాకపోగా, పశువులకు మేపేసిన సందర్భాలు ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కాగా మినుము పంటలో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు అరికడుతూ, తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అనవసరంగా రసాయన పురుగుమందులు పిచికారీ చేయకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని రైతులకు భరోసాను ఇస్తున్నారు.

ముందుగా గుర్తిస్తేనే మేలు

బూడిద తెగులులో మినుము ఆకు తొలుత అడుగు భాగాన తెల్ల మచ్చలు వచ్చి, ఆ తర్వాత మొక్క మొత్తం వ్యాప్తి చెందుతుంది. దీని వల్ల మొక్క ఆహారం తయారు చేసుకోలేకపోవటంతో మినుము గింజ గట్టి పడవు. తద్వారా దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. మినుము సాగు చేసిన పొలాల్లో కలుపు మొక్కలు పెరగటం వల్ల వాటి రసాన్ని పీల్చేందుకు తెల్లదోమలు బాగా వ్యాప్తి చెందుతాయి. తెల్లదోమ సోకిన మినుము పంట పొలంలో పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలని, తద్వారా దోమలు వీటికి ఆకర్షించబడి జిగురు అట్టకు అతుక్కుని చనిపోతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తెల్లదోమ మరీ అధికంగా ఉన్నప్పుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేమాస్త్రం పిచికారీ చేయవచ్చని వివరిస్తున్నారు. వేప ఆకులు, ఆవు పేడ, ఆవు మూత్రం కలిపి నేమాస్త్రం తయారీ చేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సహాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ నేమాస్త్రం ద్రావణాన్ని మినుము పంట సాగు చేసిన 25 రోజులకు ఒకసారి, 35 రోజులకు మరోసారి సాయంత్రం పూట పిచికారీ చేయాల్సి ఉందని రైతులకు వివరిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించండి



మినుము పంటకు చీడపీడలు ఆశించకుండా రైతులు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పలుచోట్ల తెల్లదోమ, బూడిద తెగులు వ్యాప్తి చెందటంతో రైతులు ఆందోళన పడుతున్నారు. తెగుళ్లను ఆదిలోనే గుర్తిస్తే ప్రకృతి వ్యవసాయ విధానాలతో పూర్తిగా అరికట్టవచ్చు. ఇప్పటికే గ్రామాల్లో తిరుగుతూ నివారణ, నియంత్రణ చర్యలకు మందుల పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జొన్నలగడ్డ భవాని,
బాపులపాడు మండల వ్యవసాయాధికారి

టీడీపీలో వర్గపోరు

గన్నవరం: గన్నవరంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ నేతల మధ్య ఉన్న వర్గపోరు రచ్చకెక్కింది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తొలుత ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు నేతృత్వంలో పలువురు ఎస్సీ, బీసీ మహిళలు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొద్ది సేపటికే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వర్గం అక్కడికి చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన పూలమాలలను తొలగించారు. అనంతరం యార్లగడ్డ అక్కడికి చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అయితే జాస్తి నేతృత్వంలో ఎస్సీ, బీసీ మహిళలు వేసిన పూలమాలలను యార్లగడ్డ వర్గం తొలగించడంపై టీడీపీలోని పలువురు సీనియర్ నేతలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్యాయంగా పూల దండలు తొలగించడంపై ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సిబ్బందిని సదరు జాస్తి వెంకటేశ్వరరావు వివరణ కోరినట్లుగా తెలుస్తోంది. ఈ సంఘటనతో టీడీపీలో గత కొంత కాలంగా జరుగుతున్న వర్గపోరు ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా రోడ్డున పడడం చర్చనీయాంశమైంది.

రేపటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

ఉంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మల్లిబాబు తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మట్లాడుతూ వైద్య శిబిరాల్లో పశువులు, కోళ్లకు నట్టల నివారణ, టీకాలు, అవసరమైన గర్భకోశ సంబంధిత చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యులు స్వర్ణలత, సుధీర్ బాబు, నాగార్జున పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగునకు కృషి



కానూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ భవానిప్రాద్



పెనమలూరు మండల పరిషత్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ ప్రణవి



ఉంగుటూరులో మొక్కను నాటుతున్న ఎంపీపీ సరోజిని

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ భవానిప్రసాద్ అన్నారు. కానూరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానికులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, మున్సిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు. అదే విధంగా పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రణవి కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అనంద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలి

ఉంగుటూరు: పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు ప్రతిఒక్కరూ రోజుకు కొంత సమయం కేటాయించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా పరిసరాలను శుభ్రం చేసుకుంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఎంపీడీఓ సత్యకుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో నెల ఒక్కో థీమ్‌తో ఏడాదికి 12 అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం జంగిల్ క్లియరెన్స్, మొక్కలు నాటడం, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.విమలకుమారి, ఈఓపీఆర్‌డీ దిలీప్‌కుమార్, ఏపీఓ టి.వెన్నెల, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయంలో ఐదో తరగతి ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన జేఎన్‌వీ ఎంట్రెన్స్ టెస్ట్-2025 ప్రశాంతంగా ముగిసింది. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో 24 ముఖ్య పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. జేఎన్‌వీ ఎంట్రెన్స్ టెస్ట్‌కు మొత్తం 5,788 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ప్రవేశ పరీక్షకు 2,474 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రవేశ పరీక్షకు 3,314 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలు పూర్తిగా ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల ఆధారంగానే జరుగుతాయని, ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి వదంతులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

చెత్త తరలింపు పనులు ప్రారంభం



పంట పొలాల్లో చెత్తను డంప్ చేస్తున్న టిప్పర్

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పల తరలింపు పనులు ప్రారంభమయ్యాయి. చెత్త తరలింపునకు సంబంధించి ఇష్టరాజ్యంగా అంచనాలు పెంచడంపై పాలక వర్గ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ రాత్రికిరాత్రి పనులు చేపట్టారు. ఒప్పందం ప్రకారం గన్నవరానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపావులూరు క్వారీ గోతుల్లో చెత్త కుప్పలను డంప్ చేయాల్సి ఉంది. అయితే క్వారీ గోతుల్లో డంప్ చేయడాన్ని ఆ ప్రాంత రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో రోడ్డు పక్కన తొలగించిన చెత్త కుప్పలను కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రైవేట్ స్థలంలో రాత్రి నుంచి డంప్ చేయడం ప్రారంభించారు. టిప్పర్లు, ట్రాక్టర్లు ద్వారా చెత్తను సదరు పొలంలోకి తరలించారు. అయితే ప్లాస్టిక్, ఇతర రసాయనిక వ్యర్థాలతో కూడిన చెత్తచెదారాన్ని పంట పొలాల్లో డంప్ చేయడంతో పరిసరా ప్రాంత భూములు దెబ్బతినే పరిస్థితి ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అనధికార చెత్త డంపింగ్ యార్డు తొలగింపు పనులను శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. చెత్త తొలగించిన ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది పచ్చదానాన్ని పెంపొందించాలని అధికారులకు ఆయన సూచించారు.

పరిశుభ్రతే స్వచ్ఛాంధ్ర లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



కాటూరులో వీధులు శుభ్రం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కలెక్టర్

ఉయ్యూరు: పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రతే స్వచ్ఛాంధ్ర లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేశారు. సచివాలయం సమీపంలో మొక్కలు నాటారు. సంపద కేంద్రాన్ని సందర్శించి తడిచెత్త-పొడిచెత్తను పరిశీలించారు. ఇంటింటికీ డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో మమేకమయ్యారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. ప్రతినెలలోనూ మూడో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో ఆయా గ్రామాలు, పట్టణాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టడానికి పది రకాల కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ అరుణ, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్డీఓ హెలా షారోన్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

నున్న(విజయవాడరూరల్): అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. శనివారం నున్న గ్రామంలో పంచాయతీ నిధులు రూ.41.90 లక్షలు, అవుతు శివారెడ్డి విరాళం రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలల నిర్మాణాలకు జమీందారులు విరాళాలు అందచేసి తమ పేర్లను పెట్టుకునే వారన్నారు. ప్రస్తుతం ప్రజలు విరాళం ఇస్తే వారి పేర్లను పెడతామన్నారు. ఈ విధంగా అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. తొలుత కోటకట్ట సెంటర్లో సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కాటూరి సరళ, ఎంపీడీఓ బి.విగ్గిన్స్, ఏఈ ఎస్.శివరామకృష్ణ, ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్లో గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఎన్టీఆర్‌కు నివాళి

విలేజి రెవెన్యూ అధికారి తొర్లికొండ శంకర్ ఆర్థిక సాయంతో నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రారంభించారు. ఎన్‌టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకుని నున్న గ్రామం విచ్చేసిన ఎమ్మెల్యే వెంకట్రావ్ ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాబురావు, మండల అధ్యక్షుడు జి.చినరామారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ



తాడిగడపలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి తాడిగడప జంక్షన్‌లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, దోనేపూడి రవి, రామ్‌కుమార్, షేక్.బుజ్జి పాల్గొన్నారు. పోరంకి, పెనమలూరు గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

రామవరప్పాడులో..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో ఎన్‌టీఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. గ్రామంలోని పిన్నమనేని హైట్స్ వద్ద మాజీ జెడ్పీటీసీ కందిమళ్ల అంజనీకుమారి భర్త కందిమళ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎన్‌టీఆర్ వర్ధంతి నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. కేసరపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే మూల్పూరు బాలకృష్ణారావు తదితరులు నివాళులర్పించారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రధాన కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి జైరమేష్ విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్ కళాపరిషత్ చైర్మన్ మురళీ, టీడీపీ నాయకులు గుత్తా అనిల్, దాసరి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 75 రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో విశిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం నవచండీ హోమం, చండీ పారాయణం పూర్ణాహుతి నిర్వహిస్తునట్లు తెలిపారు.

కల్యాణ వేదికకు భక్తుల విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆవరణలో నూతనంగా చేపట్టిన కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు రూ. 50 వేలు విరాళాలు ఇచ్చారు. ఈ మేరకు శనివారం నాగాయలంకకు చెందిన సబ్బినేని మోహిత్‌సాయితేజ రూ.25 వేలు, విజయవాడకు చెందిన కాసన్నేని మధుసూదనరావు రూ. 25 వేలు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో కల్యాణ వేదిక నిర్మాణాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురానున్నట్లు శ్రీధర్ తెలిపారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు, ఆలయ కమిటీకి చెందిన కాసన్నేని నాని పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి



పోరంకి సెంటర్లో ఆందోళన చేపట్టిన వ్యాన్ డ్రైవర్లు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో తడి చెత్త-పొడి చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు వెంటనే ప్రభుత్వం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోరంకి సెంటర్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాన్ డ్రైవర్లు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు లేక తమ కుటుంబాలు పస్తులు ఉంటున్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా నైనా జీతాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్‌ను కోరామన్నారు. అయితే ఇప్పటివరకు తమకు జీతాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాల కోసం అధికారులకు, నాయకులకు అనేక విజ్ఞాపనలు ఇచ్చినా న్యాయం జరగలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వ్యాన్ డ్రైవర్లు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి త్రిమూర్తి, నాయకులు మస్తాన్‌వలి, నరసింహారావు, సూర్యనారాయణ, రాంబాబు, ఎస్.రాజు, లింగయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంకిపాడు: ఎన్‌టీ రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం కంకిపాడులోఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర నేత్ర చికిత్సాలయం వైద్యుల సహకారంతో పట్టణంలోని తుమ్మలపల్లి కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. టీడీపీ జిల్లా నాయకులు హరికృష్ణ, నాంచారయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ప్రజాపతినిధుల దూరం

నున్న(విజయవాడరూరల్): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శనివారం నున్న గ్రామంలో రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు స్థానిక పంచాయతీవార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. సిమెంటు రోడ్డుకు పంచాయతీ నిధులు రూ.41.90 లక్షలు ఖర్చు చేసినా వార్డు సభ్యులకు ఆహ్వానం లేదని రోడ్డు ప్రారంభోత్సవానికి వారు దూరంగా ఉన్నామని అంటున్నారు. వారితో పాటు మండల పరిషత్ సభ్యులకు ఆహ్వానం లేదని వారు కూడా దూరంగా ఉన్నారు.